క్లుప్తంగా

ఘనంగా ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న ఆరోగ్యభారతి ప్రముఖులు

కర్నూలు(హాస్పిటల్): భగవాన్ ధన్వంతరి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో గురువారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి పూజ, వైద్యులకు సన్మానం చేశారు. అనంతరం వివేకానంద స్కూల్‌లో పిల్లలకు యోగా పాఠాలు నేర్పించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యదర్శి ఎండీవీఎస్ రామశర్మ చెప్పారు. ఆరోగ్యభారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, జిల్లా కార్యదర్శి బి.సత్య నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

11న భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో భగవద్గీత సహస్ర గళ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ పేర్కొన్నారు. గురువారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో కార్యక్రమ పోస్టర్లను గీతా ప్రచార సంఘం చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, సంఘం సభ్యులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 11న గీతా జయంతిని పురస్కరించుకొని గీతా ప్రచారధామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9, 10 తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ వి.ఎస్.ఆర్.మూర్తిచే భగవద్గీత జ్ఞాన యజ్ఞ ప్రవచనాలు, 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు రమణ మహర్షి ఉపదేశసారం,10వ తేదీ ఉదయం, సాయంత్రం శ్రీమద్భగవద్గీత కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11వ తేదీ వెయ్యి మందితో భగవద్గీత పారాయణం ఉంటుందన్నారు. సంఘం ఉపాధ్యక్షులు జగన్నాథ్ గుప్త,సభ్యులు పాల్గొన్నారు.

1న షుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదిన షుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జి.భవానీప్రసాద్ షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

రేపు టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని టేబుల్ టెన్నిస్ హాల్‌లో ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులు, అలాగే సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

'లంచం అడగలేదు'

కర్నూలు (హాస్పిటల్): ఎఫ్ఎన్ఓ పార్వతిబాయి పదోన్నతి విషయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎవ్వరూ లంచం అడగలేదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆమెకు జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు అర్హత లేదని ఈ ఏడాది ఫిబ్రవరి 6న అప్పటి డీఎంహెచ్ఓ రాతపూర్వకంగా తెలిపారన్నారు. మళ్లీ ఆమె అదే నెల 16వ తేదీన అర్జీ పెట్టుకోగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శాఖకు మార్చి 15న పంపినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని పోస్టు కావడంతో ఇక్కడే పరిష్కరించుకోవాలని మే 6న డీహెచ్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ విషయంలో ఎవరూ లంచం అడగలేదని స్పష్టం చేశారు.

శరీన్‌నగర్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్



నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ అధికారులు


కర్నూలు న్యూసిటీ: నగరంలోని శరీన్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు 5000 కేవీ నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించేందుకు అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈఈలు శేషాద్రి, బిందులత, ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రా'కింగ్' సాల్ట్


- నగరంలో రాక్ సాల్ట్ విక్రయాలు
- పంజాబ్, రాజస్తాన్ నుంచి తీసుకొచ్చి అమ్మకం
- కొనేందుకు మొగ్గుచూపుతున్న నగరవాసులు



సైంధవ లవణాన్ని కొనుగోలు చేస్తున్న ప్రజలు



అమ్మకానికి ఉంచిన రాక్‌సాల్ట్



నలుపురంగు సైంధవ లవణం

కర్నూలు న్యూసిటీ: సూపర్ మార్కెట్లలో ప్యాకెట్లలో మిశ్రమంగా కనిపించే సైంధవ లవణం కర్నూలు నగరంలో పలు కూడళ్లలో అమ్మకానికి దర్శనమిచ్చింది. పంజాబ్, రాజస్తాన్ నుంచి వ్యాపారులు రాక్‌సాల్ట్‌ను మినీ లారీలలో తీసుకొచ్చి నగరంలోని పలు కూడళ్ల వద్ద అమ్మకానికి ఉంచారు. దీని గురించి తెలియని వారు ఇవేమి రాళ్లు ఇంత వింతగా ఉన్నాయని ఆశ్చర్యానికి గురై వాటి గురించి ఆరా తీశారు. తెలిసిన వారు వాహనాల నుంచి దిగేసి కిలోల ప్రకారం కొనుక్కొని వెళుతున్నారు. పింక్ సాల్ట్‌ను కిలో రూ.70, బ్లాక్ సాల్ట్‌ను కిలో రూ.100కు విక్రయిస్తున్నారు.

బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు

సైంధవ లవణం మెగ్నీషియం సల్ఫేట్‌తో తయారైన ఖనిజ లవణం. ముదురు నీలం, ఊదారంగు, గులాబీ, నారింజ, ఎరుపు, పసుపు, బూడిద రంగుల్లో దొరుకుతుంది. ఇందులో ఎలాంటి రసాయనాలు ఉండవు. సాధారణ ఉప్పుకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిపుణులు సైంధవ లవణాన్ని సూచిస్తున్నారు. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, ఇనుము, మాంగనీస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. మామూలు ఉప్పు మూడు స్పూన్లు వాడే బదులు రెండు స్పూన్ల సైంధవ లవణం సరిపోతుంది. సైంధవ లవణాన్ని వాడటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. థైరాయిడ్ సమస్యకు బాగా పనిచేస్తుంది. మజ్జిగలో కలుపుకుని తాగితే అజీర్ణం, మలబద్దకం వంటి సమస్యలు తొలగిపోతాయి. సైంధవ లవణంలో ఐరన్ ఉండటంతో రక్తహీనత సమస్యతో బాధపడేవారికి చక్కగా ఉపయోగపడుతుంది. సైంధవలవణం నీటిలో కలిపి పుక్కిలిస్తే గొంతు నొప్పి తగ్గుతుంది. జలుబు చేసినప్పుడు ముక్కు మూసుకుపోవడం, దగ్గు, గొంతునొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే దీన్ని శరీరానికి ఔషధ నిధిగా చెబుతారు.

ఉప్పుకు, సైంధవ లవణానికి తేడా

సముద్రపు నీటిని ప్రత్యేక ముడులలోకి మళ్లించి నీరు ఆవిరి అయిన పిదప ఉప్పు మిగులుతుంది. ఇందులో అయోడిన్, మెగ్నీషియం, సల్ఫర్ లవణ మిశ్రమం ఉంటుంది. రాక్ సాల్ట్ లేక సైంధవ లవణము భూమి లోపల ఏర్పడిన శిలల నుంచి తొలచబడినది. వందల ఏళ్ల కిందట సముద్రము నీరు భూమి పొరల లోనికి ఇంకిపోయి ఉప్పుగా శిలా రూపంగా మారుతుంది. దాన్ని తవ్వి అవసరమైన పద్ధతుల ద్వారా తయారు చేస్తారు. ఇందులో సోడియం క్లోరైడ్ ఎక్కువ శాతం ఉండి త్రిదోష కాలకు ఉపయోగించబడుతుందని ఆయుర్వేద శాస్త్రం సూచిస్తోంది.

దేశ సరిహద్దు నుంచి తీసుకొస్తాం



రాక్ సాల్ట్‌ను ఇండియా, పాకిస్తాన్ బార్డర్‌లోని పంజాబ్, రాజస్తాన్‌లో సేకరిస్తారు. అక్కడి వారి నుంచి కొనుగోలు చేసి వాహనాలలో దేశంలో పలు రాష్ట్రాలకు తీసుకెళ్లి అమ్ముతాం. ఆరోగ్యానికి మంచిది కావడంతో ప్రజలు బాగా కొనుగోలు చేస్తున్నారు.

– తోట రాము, వ్యాపారి

ఆయుర్వేద ముందుల తయారీలో కీలకం



ఆయుర్వేద మందుల తయారీలలో సైంధవ లవణం ఉపయోగిస్తున్నారు. జీర్ణకోశ సమస్యలను పరిష్కరించే భాస్కర లవణ చూర్ణం, నొప్పుల ఉపశమనానికి వినియోగించే సైంధవైద్య తైలం, లివర్ సమస్య పరిష్కారానికి వినియోగించే ఆర్కలవణం తయారీలో సైంధవ లవణం వాడతారు. సాధారణ ఉప్పు బదులు సైంధవ లవణం వాడకం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి.

– డాక్టర్ సిరిగీత, బీఏఎంఎస్

పూలే ఆశయాలు కొనసాగిద్దాం



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కర్నూలు (టౌన్): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నేతలు కిషన్, అనీల్‌కుమార్, ధనుంజయ ఆచారి, శ్వేతా రెడ్డి, రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో పాటుపడ్డారన్నారు. మహిళల విద్యకు ప్రాధాన్యత ఇచ్చి అనాడే బీజం వేసిన మహా నాయకుడు అని కొనియాడారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయంలో పూలే ఆశయాలు నేరవేరాయన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం, ఆర్థికాభివృద్ధి వంటి ఎన్నో సంస్కరణలు వంద శాతం అమలయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ స్ఫూర్తి

కర్నూలు(సెంట్రల్): జ్యోతిరావు పూలే అందరికీ స్ఫూర్తి అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, నగర కమిటీ అధ్యక్షుడుషేక్ జిలానీబాషా, దామోదరం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి ఉదయ్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని శ్రీమేధా జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆర్‌యూలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్, తదితరులు

అధికారికంగా నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బిర్లాగేట్ కూడలి మీదుగా మంత్రి వెళ్లినా, కనీసం పూలే విగ్రహానికి పూలమాల కూడా వేయకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానిక సర్కిల్‌లో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పలువురు బీసీ నేతలతో కలిసి ఆమె పూలే విగ్రహం ముందు నినాదాలు చేశారు. బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, టీ శేషఫణి, నంది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య ధోరణిని ఎదిరించిన మహనీయుడు

కర్నూలు కల్చరల్: సమాజంలో కులాల మధ్య హెచ్చుతగ్గులను, ఆధిపత్య ధోరణులను ఎదిరించి నిలిచిన మహనీయుడు మహాత్మా జ్యోతీబా పూలే అని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు మాట్లాడారు. ఆచార్యులు సీవీ కృష్ణారెడ్డి, ఎన్. నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వర్చువల్ బోధన

- రాష్ట్రంలోనే ప్రథమంగా వర్చువల్ క్లాస్ రూంను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



వర్చువల్ క్లాస్ రూం నిర్వహణపై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోనే ప్రథమంగా పదో తరగతి విద్యార్థులకు వర్చువల్ క్లాస్ రూం బోధనను కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రారంభించారు.ఈ సందర్భంగా అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. ఆయన మాట్లాడుతూ.. వర్చువల్ విద్యాబోధనకు అధునాతన సాంకేతిక పరికరాలతో డీఈఓ కార్యాలయంలో స్టూడియోను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 42 మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వర్చువల్ విధానంలో బోధన అందించేందుకు ముందుకొచ్చారని చెప్పారు. డిసెంబర్ 7వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా జరపాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్‌పాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చీడపీడలను నివారించాలి

కర్నూలు(సెంట్రల్): ఆహారం, పోషణ భద్రత పథకం కింద సాగు చేసిన పంటల్లో పురుగుల నివారణపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయన గురువారం సాయంత్రం తన చాంబరులో.. వ్యవసాయ శాఖ రూపొందించిన కంది, శనగ, పత్తి పైర్లలో పురుగుల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కంది పంటను ఆశించే చీడ పీడలు, శనగ సాగుపద్ధతులు, పత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు నివారణ కోసం పోస్టర్లలో సంపూర్ణమైన సమాచారం ఉందని, ఈ సమాచారాన్ని అన్నదాతలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్‌లో సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు కప్పు, మెడల్స్ అందుకున్నారు. అండర్-14, అండర్-17 విభాగంలో ప్రతిభ చాటిన క్రీడాకారులను గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, నాగేశ్వర్ అభినందించారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

మెడికల్ కాలేజీలో పార్కింగ్ ఏర్పాట్లు



మెడికల్ కళాశాలలోని ఖాళీ స్థలం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో ఇన్‌గేట్ వద్ద పార్కింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాల బయట రోడ్డుకు ఉన్న దుకాణాలు తొలగించి గేటు పక్కనున్న ఖాళీ స్థలంలో వాటిని నిర్మించాలని మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు లేఖ రాసి స్థలం కొలతలు తీసుకున్నారు. ఈ విషయమై కళాశాల హెచ్ఓడీలతో ప్రిన్సిపాల్ సమావేశం నిర్వహించి అభిప్రాయాలు కోరగా స్థలం ఇచ్చేందుకు అందరూ నిరాకరిస్తూ తీర్మానం చేశారు. ఇదే విషయాన్ని ఆమె మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. అయినా ఆ స్థలంలో దుకాణాలు నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్న వదంతులు రావడంతో గురువారం వైద్య విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఇదే సమయంలో ఖాళీ స్థలంలో పార్కింగ్ షెడ్డును నిర్మిస్తూ కళాశాల అధికారులు ఏర్పాట్లు చేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిస్సి గ్రేస్

కర్నూలు(హాస్పిటల్): బాలికలు రుతుక్రమం సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని డాక్టర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిస్సి గ్రేస్ చెప్పారు. గురువారం స్థానిక బి.క్యాంపులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) హాస్టల్‌లో రుతుక్రమం ప్రారంభం, శుభ్రత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నిస్సి గ్రేస్ మాట్లాడుతూ.. ఆరోగ్య సూచనలు చేశారు. మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, హెడ్‌మాస్టర్ గురప్ప, సలోమి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో దూకి యువకుడి ఆత్మహత్య



అనీల్‌బాబు మృతదేహం

కర్నూలు: కర్నూలు అశోక్ నగర్ (పాలకొట్టాల)లో నివాసముంటున్న రేవూరి అనీల్‌బాబు (31) కేసీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీలోని సత్యనారాయణ, సుజాత దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. తండ్రి సత్యనారాయణ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు అనిల్‌బాబు కడప రవి సినిమా థియేటర్‌లో పాప్ కార్న్ అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. 15 రోజుల క్రితం అనారోగ్యంతో కర్నూలుకు వచ్చాడు. గురువారం ఉదయం తల్లి సుజాతతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి కేసీ కెనాల్‌లో దూకాడు. దేవనగర్ సమీపంలో నీటిలో మృతదేహం కొట్టుకుపోతుండగా స్థానికులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణోత్సవం

కల్లూరు: కల్లూరు అర్బన్ 33వ వార్డులోని శ్రీఅశ్వర్థ నారాయణ స్వామి కల్యాణోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చీడీపీడల నివారణకు యాప్

- పురుగులు, తెగుళ్ల ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వెంటనే పరిష్కారం
- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచనలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటలకు సోకే చీడపీడల నివారణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక యాప్ తీసుకొచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్ ద్వారా పంటలకు వ్యాపించిన చీడపీడల ఫొటోలు తీసి ఎన్‌పీఎస్ఎస్ అప్‌లోడ్ చేసిన వెంటనే వాటిని గుర్తించడమే కాకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలను కూడా సూచిస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో రైతులు, ఎంపిక చేసిన వ్యవసాయ అధికారులు (స్కాట్స్), జిల్లా వనరుల కేంద్రం అధికారులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సీఐపీఎంసీ) చీడపీడల నియంత్రణ అధికారులు వీరయ్య చౌదరి, సురేష్ కాంబ్లీ ముఖ్య అతిథులుగా హాజరై చీడపీడల నియంత్రణకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ.. చీడపీడల నియంత్రణకు కేంద్రం తీసుకొచ్చిన మొబైల్ యాప్‌పై రైతులు, వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల్లో చీడపీడల కారణంగా రైతులు 30 నుంచి 40 శాతం వరకు నష్టపోతున్నారని, దీన్ని సకాలంలో గుర్తించి నివారించుకుంటే రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అన్నపూర్ణ, సాంకేతిక ఏఓ అల్లీపీర తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కనీసం 350 ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, స్ట్రక్చర్ బేరర్స్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. వారు గురువారం అమరావతిలో మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో 1,590 పడకలు ఉన్నాయని, ఈ సంఖ్యను బట్టి నర్సింగ్ స్టాఫ్ 650 మంది, శానిటేషన్ వర్కర్స్ 350, సెక్యూరిటీ గార్డులు 250 ఉండాలన్నారు. అయితే ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు, స్ట్రక్చర్ బేరర్స్ కనీసం వంద మంది కూడా లేరని వివరించారు. ఈ కారణంగా వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఓపీలలో ఒక్కొక్కరు మూడు, నాలుగు వార్డుల్లో ఒత్తిడితో పనిచేయాల్సి వస్తోందన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలస్వామి నాయక్, ట్రెజరర్ సురేష్ తదితరులు ఉన్నారు.

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం రెండు సెంట్ల స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని గీతాముఖర్జీ నగర్‌లోని 38, 40వ వార్డు సచివాలయాల ఎదుట గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో సొంతిల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో ఇంటి నిర్మాణం కోసం రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో పలు సచివాలయాల ఎదుట నిరసనలు కొనసాగాయి.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పరిశీలన

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడు, పసుపల, గార్గేయపురం గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ రఘునాథ్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను ఆయన పరిశీలించారు. మ్యాపింగ్‌లో వెనుకంజలో ఉన్నామని, వేగవంతం చేయాలని ఉద్యోగులకు ఎంపీడీఓ సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జశ్వంత్ రెడ్డి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కర్నూలు క్రీడాకారుడు ఎంపికయ్యాడు. క్రీడాకారుడు జశ్వంత్ రెడ్డి చిత్తూరులోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి చక్రవర్తి వెల్లడించారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తా నగరంలో నిర్వహించే 39వ బాస్కెట్‌బాల్ యూత్ జాతీయస్థాయి పోటీల్లో జశ్వంత్ రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పత్తికొండ(తుగ్గలి): ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ టీవీ చానల్ విలేకరితో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పందికోన ఫారెస్ట్ రోడ్డులో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విలేకరి రాతన రాంప్రసాద్, నర్మామలకు చెందిన నారాయణస్వామి గాయపడ్డారు. గమనించిన పలువురు.. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం తీవ్రంగా గాయపడిన రాంప్రసాద్‌ను కర్నూలుకు రెఫర్ చేశారు.

3న పారా మెడికల్ సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు (హాస్పిటల్): పారా మెడికల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి డిసెంబర్ 3న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, రోస్టర్‌ను అనుసరించి సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈసీజీ టెక్నీషియన్ 2 సీట్లు (ఎస్సీ-1, ఎస్టీ-1), డార్క్ రూమ్ అసిస్టెంట్- 1 (బీసీ-ఏ), అనస్థీషియా టెక్నీషియన్- 2 సీట్లు (బీసీ-బీ, బీసీ-సీ), డీఎంఐటీ - 1 (ఎస్టీ), క్యాథ లాబ్ టెక్నీషియన్ - 1 (ఓసీ ఈడబ్ల్యూఎస్) ఉన్నట్లు తెలిపారు.